# అథాతో వర్ష జిజ్ఞాసా

ముత్తరాజు సుబ్బారావు

కాకిముక్కుకు దొండపండు! కోరికలకు, సాఫల్యానికి పొత్తు కుదరదని నిరూపించే మాట. అయినా కోరికలు నశించవు. అసంతృప్తి చిగురించకనూ పోదు.

రవి పశ్చిమ దిశనే అస్తమించాడు. వెన్నెం చల్లగానే ఉన్నది. మేఘాలు భూమి మీదికి దిగి రాజధానిలో సిటీబస్సుల్లా ఒకదాని వెంట ఒకటి బయలుదేరకుండా ఆకాశంలోనే వర్షాకాలంలో చిన్న స్టేషన్ల మధ్య రైలుబళ్లలా ఆగిఆగి మేజువాణి చేసుకుంటూ, ముద్దు ముద్దుగా నడుస్తున్నాయి. నిండుగా గంభీరంగా గర్భవతులైన యువతుల్లా ఉన్నాయి. మనుష్యులు మామూలుగానే రెండుకాళ్లపైన సవ్యంగానే నిలుచుకొంటున్నారు, ఆంధ్రలో రైలుబళ్లుగారు



గనుక.

రాత్రి ఒంటరి బాటసారిలాగా బిక్కు బిక్కు మంటూ సగం నడిచింది. మేఘాలు విరిగి కరిగి పోగా ఆకాశం పరుచుకున్న చుక్కలచాప కిలకిలా నవ్వుతూంది.

అప్పటికి అరగంట క్రితమే విద్యుచ్ఛక్తి కూడా స్తంభించింది. ఆవేళప్పుడు జాగ్రదవస్థలో ఉండి అవస్థ పడడానికి శేషావతారం రచయితగాదు; ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి గాని, జీతం చాలని గుమాస్తాగాని గాదు. కనీసం, ప్రభుత్వం ఆస్పత్రిలో వైద్యుడికోసం అనవరతమూ నిస్పృహతో ఎదురు చూచే ఒకరోగి ఆప్త బంధువూ గాదు.

కడుపులో చల్ల కదిలీ కదలకుండా చిన్నకార్లో ఆఫీసుకు పోతాడు. కలంలో సిరా కదిలి పాళీ చెమర్చీ చెమర్చకుండా తామరాకుపైన నీటి బొట్టులా అటూ ఇటూ ఓపుంజెడు సంత కాలు గీకి గిరవాటేసి, టిక్కు టిక్కుమనే గడియారం టక్కున ఆగి ఐదుపొర్లు తట్టి అవతారాన్ని మగత నిద్ర లేపితే మత్తుగా నిద్ర లేచి మందంగా ఉందంటూనే చిత్తుగా చిరుతిండి తినే ఆ యువకుడు—

ఆరోజు పెందరాళే ఎంగిలిపడి నిద్రపోయాడు. అర్ధాంగి ఒకటి తొడుక్కుని, అరగంట క్రితం వరకూ పది నయేపైసలు పచ్చ కవరును పదేపదే చదివి, అవులించి నిద్రపోయాడు.

రాత్రి రెండు గంటలైంది. ఆయింటి కథానాయకీయుడు ముత్తునాయర్ భార్య తిరిగి ప్రసవించింది. ఈసారి ఆడ పిల్లట. పెళ్ళాన్ని చూచి చాలాకాలమైంది. రెండున్న రోజుల ప్రయాణం. అయ్యగారు సెలవివ్వటం లేదు. ఆలోచిస్తూ పొమ్మసిల్లిన ముత్తు కలవరింతగా నిద్రలేచి లైటు వేశాడు. చీకట్లో అగ్గిపుల్ల గీచి చూచాడు. శేషావతారం ఆంజనేయావతారం లాగా మంచాన్ని కౌగలించుకొని నిద్రపోతున్నాడు. ముత్తు బుర్రలో మత్తుమ కోపం దులిపేసింది. ముఖం ఎర్రబారింది. అవతారాన్ని మింగేద్దామనిపించింది. గట్టిగా మరొక అగ్గిపుల్ల గీచి అవతారం బెడ్‌పైన ఉన్న అణాన్నర సిగరెట్ తీసి కసిగా ముట్టించాడు. 'సీకిదేశాస్త్రి' లోపలనే బోలెడు సార్లనుకుంటూ వరండాలో గోడకానుకుని కూర్చున్నాడు. జోరున ధారగా కురుస్తున్నది వెన్నెల. పోర్టికోలో నల్లకారు వెన్నెల్లో బట్టతలలాగా తళతళ మెరుస్తున్నది. ఖరీదైన సిగరెట్టు తాగుతున్న ముత్తు బుర్ర గొప్పగాపని చేస్తూంది. కొట్టు సందులో మందరమ్మ నల్లకోక గట్టుకుంటే ఎట్లా ఉంటుందో ఆలోచించుకుంటుంటే హాయిగా పంచదారపాకం తిన్నట్లుంది. దాహం పుట్టింది. మంచినీరు త్రాగాలి. చీకట్లో లోనికి పోవటం ఎలానా అనే క్లిష్టసమస్య గురించి, రెండో తేదీ ఉదయం పాలమనిషి బాకీ తీర్చేందుకు ఐదణాలు తక్కువై విలవిల్లాడే గుమాస్తాలా ఆలోచిస్తున్నాడు. వెన్నెల పరిచిన చలవ పందిట్లో గాలి బరువుగా కదులుతున్నది. నిశ్శబ్దం నిండా అలుము కున్నది.

'నల్లపిల్ల నా కొద్దు.' పెద్దగా వినిపించింది. ఉలిక్కిపడ్డాడు ముత్తు. మత్తు వదిలింది. ఎక్కడిదీ శబ్దం? దయ్యంకాదు గదా? వెన్నెట్లో వనాల్లో తిరుగుతుంటాయిట ఆడదయ్యాలు, తెల్లచీర కట్టుకుని, జుత్తు విరబోసుకుని. గుండె కలుక్కుమంది. 'అయ్య బాబోయ్!' జూలో హిప్పోలాగా నోరు తెరిచి అరిచాడు. చలికి తోడైన భయంతో పెదవులు వణుకుతుంటే అరవంలో ఆంజనేయ దండకం చదవి వట్లుంది.

'నల్ల పిల్లనాకొద్దురోయ్! మరింత పెద్దగా మరింత దగ్గరగా వినిపించింది. కాళ్ళూ, చేతులూ పారిపోకుండా అదిమి పట్టుకుని మూలిన వణుకుతూ వాలిపోతూ ఉన్న ముత్తు గొంతు నిక్కి గుర్తుపట్టాడు. అవతారం గదిలోకి జారుకున్నాడు.

లైటు వెలుగు తున్నది. శేషావతారం పక్కపైన కూర్చుని ఉన్నాడు. మంచంపైన పరుపు పడుకునే ఉన్నది. బల్లపైన గాజు కూజా, దానిపైన గాజు గ్లాసూ కూర్చునే ఉన్నాయి. గడియారం టిక్కు టిక్కుమంటూ వయ్యారం ఒంకబోస్తూనే ఉన్నది.

శేషావతారం చింత విప్పల్లాంటి కళ్ళు కొంచెం చిట్లించి పైకి చూచి రెక్కలెట్టేందుకు వాసాలైనా కన్పించక పిచ్చిగా వాకిలి వంక చూచి మెత్తగా ఒత్తుగా ఉన్న జుత్తులోకి వేళ్ళు జొప్పించి వడివడిగా బరికేస్తున్నాడు. కలవరింత కప్పిన భయం విదిలిస్తున్నాడు. ఎదురుగా ముత్తు. వీడికి బొత్తుగా బుద్ధి లేదు. హరిశ్చంద్రుడికి నక్షత్రకుడులా, గుమాస్తాకు గుడ్డలకొట్టువాడిలాగా అనవసరమైన సమయాల్లోనే ఎప్పుడూ కనిపిస్తాడు. "ఛీ" అనుకున్నాడు అవతారం. పెద్దగా అనేశాడు కూడా.

"కలవరింతా సామీ?"

"నీ బొంద!" క్లుప్తంగా సమాధానించి, పచ్చకవరు మరోసారి అందుకొని చదివి దాన్ని బల్లమీదకు విసిరి, కాళ్ళు గుండెల కదుముకొని ముసుగుతన్ని పడుకొన్నాడు శేషావతారం.

ముత్తునాయర్ అతీంద్రియ దృష్టి అమాంతం పచ్చ కవరు మీద అటూయిటూ తిరిగింది. బుర్ర కర్రసాము చేసి నిద్రపోయింది.

*　　*　　*　　*

భళ్ళున తెల్లవారింది. కోడి కూయనే లేదు. సైరన్ మ్రోగింది. కాలజ్ఞానం లేకపోయినా తెల్లవారి ఆరయ్యేవరికి దానంతటదే అరిచి ఊరుకుంది. ఊరువూరంతా నిద్రలేచింది.

చంద్రా కెఫేలో కాఫీగ్లాసులూ సాసర్లూ కృష్ణాజలంలో మునిగితేలుతున్నాయి. వేణ్ణీళ్ళలో జలక్రీడలు సల్పవలసిన తమను చన్నీళ్ళలో ముంచి తేలుస్తున్నందుకు ఆరోగ్యాధికార్ల మీద అక్కసు కొద్దీ, యజమాని మీద కోపంకొద్దీ గలగల తిట్టుకుంటున్నాయి. ఒళ్ళు పూర్తిగా తడిసీ తడవకుండానే మళ్ళీ మళ్ళీ మెల్లబడి మునుగుతూ తేలుతూ చలికాలంలో బద్ధకస్తుడిలా స్నానం చేస్తున్నాయి.

సిటీబస్సులు వాన పాముల్లా ముందుకూ వెనక్కూ నడిచి నడిచి రోడ్డెక్కి ఐదో తరగతి విద్యార్థుల్లాగా చెట్టా పట్టాలు పట్టుకుని అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాయి.

అవతారం గారింట్లో, డ్రైవరు దాసు అప్పుడే కారు తుడిచి, రాత్రి రాలిన పారిజాత పూలు ఏరి మూటగట్టి వాసన చూచుకుని మురిసి పోతున్నాడు. ఒక్కటంటే ఒక్కటే పూసిన గులాబీని చాటుగా కోసి ఎలా దాచాలో తెలియక మథన పడుతూండగా, పనిపిల్ల సీత మిట్టలు, వంపులు దిరిగిన తన శరీరాన్ని దర్శించుకుంటూ పరవండుగుండా పోతూ డ్రైవరు కంట్లో చిక్కుకుంది. ఆమె గుండ్రని కళ్ళు మళ్ళుతిరిగి జ్యోతులై దాసుకు హారతిచ్చాయి. దాసును చూసి



ఏకాగ్రత
చిత్రం—కె. ధర్మారావు (మద్రాసు-17)

సిగ్గుతో చెక్కిలి నొక్కుకుంది. గులాబి దాసు చేతిలోంచి ఎగిరి గంతేసి సీత సిగలో దాక్కుంది. దాసు గుండెల్లో ప్రేమ పాలలా పొంగి పొర్లి వది.

గేటు కిర్రుమన్నది. ఆఫీసుగుమాస్తా అప్పారావు రెండడుగులు ముందుకు నడిచి దాసు గుండెల్లోంచి పొంగి ప్రవహిస్తున్న ప్రేమ జలధికి ఆనకట్టలా అడ్డు వచ్చాడు. సీత జారుకున్నది.

"గుడ్ మార్నింగ్, పంతులు గారూ!" అన్నాడు దాసు.

"దొరగార్లేరలా?"

"ఏంబాబూ, కాఫీ హోటల్లో కాఫీ త్రాగరా ఏం?" అంటూ దాసు నొసలు వెక్కిరింతగా ఒక వైపుకు మరింత వంగింది.

"ఇదిగో, దాసూ, నీకు చాలా చెప్పానా, అలా అనవసరంగా వాగద్దని? నా విషయం

నీకెందుకూ?''

''ఉన్నపాటంటే ఉలు కెందుకు పంతులూ? లాపోతే ఏంటయ్యా తెల్లారగట్టనే వచ్చినవ్? కాకాపట్టానిగ్గాకపోతే దేనికేం?''

''మంచి గొడ్డుకో దెబ్బ.''ఏదోగొణుక్కుంటూ అప్పారావు వరండాలోకి ఎక్కాడు. ముత్తునాయర్ వయారపు నడక జూచి వరసంటు సిగ్గుతో నవ్వుకుంది. దానిమ్మచెట్టు దాచుకోలేక పకపక నవ్వినది. గంగల్లాడినది. అప్పారావు అటు చూచాడు.

''ఏమండీ, అప్పారావ్, వచ్చినవ్?''

''దొరగారికోసం. చూడూ ఓపూటలారా.'' గోప్యంగా గోపికను కృష్ణుడులా, సీతను దాసులా ముత్తును అప్పారావు పిలిచాడు.

దాసు పకపకనవ్వి, ''జాగ్రత్త, అప్పారావు పంతులూ'' అని నాలిక్కొరుక్కున్నాడు.

పంతులూ, నాయరూ వర సందులోజేరి గుసగుసలాడారు. గులాబి చెట్టు దొంగచాటుగా విని గోడమీద ముళ్లతో వ్రాసినది.

''శ్రీ అవతారంగారికి పెళ్లి. పిల్లాదేవి గారిని చూడడానికి యివాళో, మూడు రోజులుకో పోతారు. వారమో ఎన్నోజులో ఉంటారు. ఆఫీసు జల్సాగా వుంటుంది. ఒక్కడూ శ్రీకారం చుట్టడు. డ్రైవరు వరసందు విడవడు. ముత్తు మెత్తగా పరుపు మీద బజ్జుంటాడు. అర బిగించి మరీ నిద్రోతాడు.''

కిటికీ కిరుక్కు మనగానే గులాబిముల్లు ఉలికిపడి ఆగిపోయింది. భయపడి పూలమాటున దాక్కుంది.

శేషావతారం ఆంజనేయావతారం చాలించి నోట్లో బ్రష్‌తో అప్పారావుకు ద్వార దర్శన మిచ్చాడు. అతని జన్మ తరించింది. వైకుంఠానికి వేసిన తాళాల డూప్లికేటు గుత్తి పుచ్చుకుని తనకు రాబోయే తల గుమాస్తా పని తల్చుకుంటూ, గెంతుకుంటూ నిష్క్రమించాడు.

మంగళ స్నానం చేసి ప్రసాదాది సేవలు చేయించుకుని, ధూపం మేసుకుంటూ, బెడ్‌గిడ్ సర్దుకుని టకప్‌లో టిప్‌టాప్‌గా అనంతపురం పెళ్లి చూపులకు చెక్కేశాడు అవతారం.

* * * *

శేషావతారం మేనమామగారి ఆరు గదుల యిల్లు. ముందు రెల్లుగడ్డి వసారాలో ఒక పక్కగా పశువుల కొట్టం. దోమలు సరదాగా యుగళగీతాలు పాడుకుంటూ విహరిస్తున్నాయి. అప్పుడే వర్షం కురిసి వెలిసినది. రాత్రి రేడియో లో చెప్పినట్టు కొంచెం మంచి ఒక మోస్తరు వరకూ తెల్లవార్లూ వర్షం కురిసింది. గాలి కదల్లేక కదల్లేక ఆఫీసుల్లో కాగితాల్లాగా కదుల్తోంది. అవతారం తండ్రీ, వారి బావమర దులా వదిలిన చుట్టపొగ చుట్టలు చుట్ట లుగా కొత్తదారి తొక్కిన రచయిత రచనలాగా అక్కడక్కడే తిరుగుతున్నది, భూమితనచుట్టూ తాను తిరిగినట్లు.

''శేషు కొంచెం నలుపు. పోనీ బాగానే ఉను

## 'అథాతోవర్ణ జిజ్ఞాసా'

కుందాం. మరి బియ్యే ప్యాసైందుగందా!'' అన్నాడు అవతారం తండ్రి.

''అందుకే బావా అన్ని వేలు.''బావగారి భావా లను అర్థం చేసుకుని అందుకున్నాడు బావమరిది.

''నాల్గొండలొచ్చే గిజిటాఫీసరా— అరవై ఎకరాలున్నదా?''

''అద్గదీ ముక్కెం. అందుకే ముప్పైయ్యేలు అంటిగా?''

''నల్లపిల్ల గందా!'' వంటింట్లో పొంతలో నీళ్లు కాగడానికి వేరుశనగకట్టె నెగడు ఎగదోసి పొగకు కళ్లు నులుముకుంటూ వచ్చి అందుకుంది అవతారం అమ్మ.

''గదేగానేసెప్పేది? అన్నీ జూసే. అరవై యిత్తానంది'' అన్నాడు ఆమె తమ్ముడు.

''అమ్మాయికి ముక్కు పొడుగ్గనక ముప్పై. రెండుకళ్లూలేవు డెభై,తొంభై.ఏమిటనీమొగం! వాడు నల్లదాన్ని అసలొప్పుకోడు. చేసుకోడు.''

''సరే, చిన్నదాన్నే యిత్తా. మరికట్నం మాత్రం?''

''నీవల్ల గాదు.''


''మరి నల్లదానికియ్యాలా అంత?''

''సరేకాని, అయినోళ్లు మనంమనం.. తదా త్తు.''

గట్టిగా దమ్ముపీల్చి వదిలాడు అవతారం తండ్రి. ఆవుపెయ్య ఆనందం పట్టలేక 'అంబా' అని అరిచింది.

''అవును గావి అన్నా! డబ్బు నీవంటే వద్దం టావుగాని ఆవిడగారు, మా వదిన సుభద్రమ్మ గారు వూరుకుంటుందా?'' అంటూనే ఆమె అక్కడేఉండడంచూసి, గుంటూరు ఆడపడుచు గదూ, లౌక్యంగా నవ్వింది. మూతి గిర్రున తిప్పుకుని తలుపుచాటుకు పోయి కసిగా మెటి కలు విరిచింది. కణతల దగ్గర వేళ్లు కిటకిట మంటూ విన్యాసం చేశాయి.

సమావేశం ముగిసినది. శేషావతారం పెళ్లి జయ్ మని జరగాలి.



అంగడికి
చిత్రం—వై. బాలయ్య (సిద్దిపేట)

శేషావతారం పెళ్లి అతివైభవంగా జరిగింది. అవతారం వన్నె కొంచెం తరిగితేనేం? అదృష్ట శిఖరానికి అతి చేరువలో ఉన్నాడు. పెళ్లికి స్వంతకారుకుటాపుఉండటంచేతబట్టతలకారొకటి కిరాయికి తెచ్చి తురాయి కట్టుకు ఊరేగాడు. నల్లపూసల్లో నాగులాగా ప్రక్కనే శకుంతల. మెట్ల మడిమల చెప్పులూ. కాళ్లకు పారాణి. వంగ పండురంగు పట్టుచీరా. ముఖమల్ బ్లౌజ్, బుగ్గన చుక్క. కళ్లు జ్యోతుల్లా మిలమిల్లాడు తున్నాయి. పెదవులపైన దొండపండు చీల్చి అతికించి నట్లుంది. లేదా నిమ్మ పువ్వులాంటి నిగనిగలాడే ముక్కు. శ్రీకారం చుట్టిన రాళ్లబేసరి. సనాత నాధునాత నాలమధ్య సంధ్యారాగం లాగా అందంగా ఉన్నది. ఆమెగారిని చూచి అవతారం భుజాలు ఎగిరెగిరిపడ్డాయి.

''ముప్పయివేలు పోతేపోయింది. పిల్ల బంగారం గోరింకలాగుంది. ఏమందం! ఏమందం!'' అన్న దో యిల్లాలు.

''అబ్బాయే మరీ... జీరంగిలా ఉండడు.'' నలుగురు అమ్మలక్కలు వాళ్ల అక్కను అక్కడే వెళ్లగక్కారు.

వీధినపోయే ఒక స్టూడెంటుకు ఆగ్రహం వచ్చి ''కాకిముక్కు దొండపండు!'' అని అరిచి సందు మలుపు తిరిగాడు. అవతారం అతని కోసం గాలించాడు గాని ఆ జనంలో కనపడ లేదు.

''పిల్లలు మలగోబా మామిళ్లలా'' ఉంటా రని ప్రొద్దున్న తిన్న అరిసెలు గుర్తుకు రాగా తేల్చింది అవతారం తల్లి.

ముందువెనుకలుగా శకుంతల అక్క అన సూయకూ మెళ్లోతాళి ముడిపడింది. అరవై వేలూ పుచ్చుకుని మరీ చేసుకున్నాడు అతడు. అతనూ ఆఫీసరే. పి ల్లా డు బం గా రం. పిల్లే కస్తూరి.

ఊరేగింపు జరుగుతున్న వీధిలో ఒక ఇంటి అర్చిమీద కూర్చున్న కరణంగారి నెమలి ''భలే భలే'' అన్నట్లు క్రేంక్రేంమ్మని కూసింది. ఎగిరిగంతేసి పున్నాగం చెట్టుపైన వాలింది. పున్నాగం ఆనందం పట్టలేక పది పూలు రాల్చింది. దంపతులపైన రాల్చి ఆశీర్వదించింది.

నల్లబావను చేసుకోవలసి వస్తుందని శకుం తలగాని, ఎర్ర మొగుడు దొరుకుతాడని అన సూయగాని అనుకోలేదు. పల్లెటూళ్లలో ముదురు రంగుల ముచ్చట దీర్చుకున్న శకుం తలకు బావా అందరిలానే ఉన్నాడు.

రూపాయల గలగలల్లో నిగనిగల్లో అనసూయ కూడా మెరిసింది ఆమె భర్తకు. అయితేనేం? ''రంగు రాచుకు తింటామా ఏం'' అను కున్నాడు అతని తండ్రి.

''డబ్బుపోతే పోయింది. శకుంతల దొరకటం నా అదృష్టం'' అనుకుని కాలర్ ఎగదీసి నిలవేసి నడిచాడు అవతారం.

* * * *

గోడమీది సినీ కాలెండరును పన్నెండు

పార్కు పరపరచించాడు అవతారం. కొత్తతార కొత్తబొమ్మ ఆ గోడ నలంకరించి ఆరే రోజులైంది.

ఆ రోజు సూర్యోదయం వేసుకున్నా నలభై ఎనిమిది గడియలు వెనక్కు నెట్టి చంద మామ మబ్బుల చాటునుండి అవతారాన్ని తొంగి చూస్తున్నాడు. దాక్కుని వెక్కిరిస్తున్నాడు. ఆ రోజు అవతారం తండ్రి కాబోతున్నాడు.

ఆస్పత్రిలో నర్సులు మానస సరోవరంలో హంసల్లా క్రీడాలోకంలో విహరిస్తున్నారు. కొందరిముఖాల్లో నల్ల నైలాన్ తెరలు వ్రేలాడు తున్నాయి.

వెన్నెల్లో తడుస్తూ కారు బంపర్ మీద బూటుకాలు పెట్టి మోకాలు పైన మోచేయి పోటీపెట్టి అరచేతిలో ముఖారవిందాన్ని చిమ్మిరి ముద్దలా ఉంచి ఆస్పత్రి పెంకుల వరండాపైన పెంకెగా అరుస్తున్న క్రిరు పిట్టను చూస్తూ ఉన్నాడు అవతారం.వరండాలో శబ్దం చటుక్కు మంటే అతని ముఖంలో రంగులు మారు తున్నాయి.

"అమ్మాయి పుడితే.. కాదు. ఛీ. అబ్బాయి. అమ్మాయి నల్లగా...."

పెద్దగా అరిచి ఏడుద్దామనిపించిందతనికి. ఆఫీసరు గనుక బలంగా బానెట్‌మీద ఒక్కతాపు తాచి ఊరుకున్నాడు.

"ఆడపిల్ల నల్లగా వుంటే!" కృష్ణానదిలా ఒత్తుగా ఉరవడిగా ప్రవహించే ఆలోచనల వేడికి తల పేలిపోకుండా మఫ్లర్ చుట్టుకుని కదలకుండా కార్లో కూర్చున్నాడు.

వరండాలో ఉన్న లైట్లు లోపల ప్రసవ వేదన పడుతున్న పడతుల మూల్గులు విని బాధతో దీనంగా వెలుగుతున్నాయి. డ్యూటీలేని నర్సు సినిమాకు పోతూ చుట్టం చూపుగా వచ్చి మెత్తగా వరండాలోంచి పోతుంటే తల్లో పూలచెండు చలికివణికి జారి భూమిమీద పడింది. ఆ శబ్దానికే అదిరిపడి అవతారం అటూయిటూ చూచి తనలో తనే నవ్వుకున్నాడు. వాళ్ల వదినె అనసూయ గుర్తుకు వచ్చింది. నల్లగా ఎత్తుగా ఎర్రటి కళ్ళు.

"ఛీ!" పెదవులు వణికాయి. పైన అండఉన్న గుమాస్తాలాగా అతని శరీరం అతనికే ఎదురుతిరిగింది.

శకుంతలాదేవి ప్రసవ వేదన పెరిగి పెట పెట్లాడినది. శేషావతారం ముఖం చీకట్లో చిటచిట్లాడినది. స్ప్రింగ్ సీట్లో స్టీరింగ్ ముందు కునికిపాట్లు పడి మత్తుగా తలవాల్చి నిద్ర పోయాడు.

"నల్లపిల్ల నాకొద్దు." పెద్దగా కలవ రించాడు. అప్పుడే అక్కడికి వస్తున్న లేడీ డాక్టరు కిలాకిలా నవ్వినది.

"అబ్బాయేనండి. మరేం భయం లేదు" అన్నది.

అంతే. వాడు నల్లగా ఉన్నా పరవాలేదు. లోకంలో ఎంతమంది లేరు నల్లగా? కాని...ఆడ వాళ్ళుండగూడదు. ఆనందంతో అతని కళ్ళు మెరిశాయి.

ఆంజనేయావతారంలా మంచాన్ని కౌగలించు కు పడుకునే అవతారం, కారు ముందు సీట్లో రెండు కిటికీల్లోంచి ఒకవైపు కాళ్ళు, ఒకవైపు తల బయటికి పారవేసి రెండు చేతుల్తో స్టీరింగ్‌ను దగ్గరగా లాక్కుని గుండెల కదుముకుని కునుకు తీశాడు.

ఏడాదిన్నర గడిచింది.

• • •

ఇల్లంతా గల్లంతుగా ఉన్నది. వరండా నూట్లు బూట్లతో కిటకిట్లాడుతున్నది. అవతారం నౌకర్లూ, చాకర్లూ, షోఫియర్లూ కబుర్లుమాని వచ్చే పోయేవారికి సపర్యలు చేస్తున్నారు. వింజామరలు తాహతు ల్ననుసరించి వీస్తున్నారు. ముహూర్తం మించుతుందేమో నని పదే పదే గోడ గడియారం చూస్తున్నాడు సిద్ధాంతి. అవతారం తండ్రి ఆనందంతో బరు వెక్కిన తన శరీరాన్ని ఒక పేము కుర్చీలోబిగించి లేవలేక అలానే ఉండిపోయి పనివాళ్ల మీద పెత్తనం సాగిస్తూ వచ్చేపోయేవారిని పరా మర్శిస్తున్నాడు. 'తల' గుమాస్తా అప్పారావు చదివింపుల సమయంకోసం తహతహలాడు తున్నాడు. చేతిలో చిల్లిగవ్వలేని చిన్న గుమా స్తాలు చెదురుగా స్తంభాల చాటున నక్కుతూ సిగ్గుతో నలిగి చస్తున్నారు.

వీధి కెదురుగా వెండిపూలు చెక్కిన పీటల మీద కూర్చున్నారు అవతారం, శకుంతలానూ. వశిష్ఠుడు చెప్పే మంత్రాల గడగడకు మరింత ఉక్క తీసి వీసురు కుంటున్నారు కొందరు. కవరొకటిచ్చి పోతున్నపోస్ట్‌మన్ అడిగితే"అబ్బాయి గారికి అన్నం ముట్టేస్తున్నా"రన్నాడు అప్పారావు. అవతారం గర్వంగా చుట్టూ చూశాడు, మంత్రి పదవి వస్తే అంతస్తు ఎదిగినట్లు.

గడియారం అరగంట కొట్టింది.

అవతారం కళ్ళు ఎవరికోసమో అదే పనిగా వెదుకుతున్నాయి. పరధ్యానం పెరిగిపోయింది. విసుగ్గా అతని నొసలు వంగింది.

"అబ్బాయి బంగారు గొలుసు ముట్టు కున్నాడు" అన్నారెవరో.

"నా మనుమడుగదూ!"ఇంకీ యిల్లు బంగారమే అన్నట్లు మీసాలు దువ్వాడు అవతారం తండ్రి. ఓహో! అంటే ఓహో హో!! అన్నారు వారు వీరు. అవతారం మాత్రం గడియారం వంకా, గేటు వంకా కన్నార్పకుండా చూస్తూనే ఉన్నాడు.

కా రాగింది.

శేషావతారం కళ్ళు రెపరెపలాడాయి.టపటప నీళ్ళలో మునిగి విదుల్చు కుంటున్న నీటి బాతు ల్లా కొట్టుకున్నాయి.

అనసూయ, ఆమె భర్త, అరచేతిలో పొత్తి ళ్లలో పసికూన. ఎర్రగా గుమ్మడి పండల్లే కేరు కేరంటున్నాడు.

అవతారం కళ్ల జోడు తుడిచి మళ్లీ పెట్టుకున్నాడు. దగ్గరికి వెళ్లి వాళ్లను ఆహ్వానించాడు. కళ్లజోడు కాలు విరిగినట్లు ఒక పక్క చెవి కిందికి జారింది.

ఆశీర్వాదం పూర్తయింది . అక్షతలు అన సూయ కొడుకు మీద పడ్డాయి.

"వాడు ఎర్రగా ఉన్నాడేం?"

విధివిధానం మీద అప్పుడు శేషావతారానికి కలిగిన నమ్మకం బహుశా విధాతకు తన సృష్టి మీదనే కలిగి ఉండదు.

పాపాయి లిద్దరూ కిలకిల నవ్వారు.

అప్పచెల్లెళ్లిద్దరూ నచ్చ జెప్పుకున్నారు.

"రంగులో ఏ ముందని?"

అవతారం తండ్రి బుగ్గ మీసాలకు పగ్గాలు కట్టి పైకి లేపాడు. గర్వంగా నవ్వాడు. మనుమల్ని ఎత్తుకు గుండెలకు ఒత్తు కున్నాడు.

శకుంతలా నవ్వింది.

అవతారమూ నవ్వాడు. ★



'స్వాగతం! సుస్వాగతం!' ఫోటో—'భరద్వాజ' (మద్రాసు-18)